క్లుప్తంగా

వైద్య శిబిరంలో 136 మందికి పరీక్షలు


నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పరమహంస యోగానంద నేత్రాలయ వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఏలూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గీతా భవనంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 136 మంది పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. నగరానికి చెందిన ఆయుష్ హాస్పిటల్ వైద్యులు బీపీ, సుగర్, జనరల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీవీ బాలకృష్ణారావు సహకారంతో నిర్వహించిన నేత్రవైద్య శిబిరంలో 36 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 16 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. గుర్తించిన వారిని వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాలకు తరలించారు. అవసరమైన మరో 31 మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఏలూరు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మానేపల్లి రామారావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కాకరాల వేణుబాబు, అక్కినేని వెంకటేశ్వర రావు, బొలిశెట్టి సురేష్ కుమార్, అల్లం వెంకట సుబ్బారావు, చెన్న వెంకట్రామయ్య, బొడ్డు శ్రీనివాస్, గొల్లపూడి రామకృష్ణ, రావిపూడి మోహనరావు రోగులకు సేవలు అందించారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు


పవర్‌పేటలో వాసుదేవ స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక అగ్రహారంలోని భూనీళా సమేత జనార్థన స్వామి దేవస్థానంలో ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక పవర్‌పేట వాసుదేవాలయంలో ఉదయం స్వామి వారికి నిత్యపూజా కైంకర్యాలు సమర్పించారు. కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో నిత్య హోమం

నగరంలోని పోస్టల్ కాలనీలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి 23వ శాంతి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు చేశారు. సాయంత్రం నిత్య పూజ, నీరాజనాలు సమర్పించారు. కార్యనిర్వహణాధికారి కలగర శ్రీనివాస్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- దెందులూరు నియోజకవర్గ ప్రజలకు తొలగనున్న ఇక్కట్లు
- త్వరలో రూ.10 కోట్ల పనులు ప్రారంభం
- 9 ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ కనెక్షన్లు పూర్తి
- త్వరలో తాగునీటి సరఫరా ట్రయల్ రన్


పలు గ్రామాల్లో పైప్‌లైన్ కనెక్షన్లు బిగిస్తున్న దృశ్యం


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం, దెందులూరు నియోజకవర్గ గ్రామాల్లో రూ అర్బన్, జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన తాగునీటి పనులు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. నెలరోజుల్లో ఈ పనులకు ప్రారంభోత్సవం నిర్వహిస్తామని మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ చెప్పారు. ఇప్పటికే ట్యాంకులకు రంగులు వేయడంతో పాటు పైప్‌లైన్ కనెక్షన్స్ పూర్తి చేశామన్నారు. త్వరలో ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి కారణంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.10 కోట్లతో గ్రామాల్లో 9 భారీ ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించింది. వీటి సామర్థ్యం 660 క్యూబిక్ లీటర్లు ఉంది. దీనికి తోడు 20 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ పనులు పూర్తి కావడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వం ఉదాశీన వైఖరి

గత ప్రభుత్వం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదు. ఫలితంగా 15 గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడ్డారు. నీటి సరఫరా సమయంలో భవన యజమానులు మోటార్లు ఉపయోగిస్తున్నారు. ఫలితంగా శివారు ప్రాంతాల పేదలకు తాగునీరు అందక అవస్థలు పడుతున్నారు.

అభివృద్ధి పనులు

ప్రజల అవసరాల మేరకు ఒక్కొక్క గ్రామంలో 40 కిలోలీటర్ల సామర్థ్యం కల్గిన ట్యాంకుల నుంచి 200 లీటర్ల సామర్థ్యం గల 9 ట్యాంకులను అధికారులు నిర్మించారు. ఈ ట్యాంకుల నుంచి గ్రామ శివారున నివసిస్తున్న పేదలకు సైతం తాగునీరు పుష్కలంగా అందుతుంది. మాదేపల్లిలో రూ.80 లక్షలతో పూర్తి చేసిన 200 లీటర్ల సామర్థ్యం కల్గిన ట్యాంకు పెద్దది. మల్కాపురంలో రూ.40 లక్షలతో 90 కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంకు మరొకటి నిర్మించారు. శ్రీపర్రు, గుడివాకలంక 60 కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంకులు మరో రెండు నిర్మించారు. మహేశ్వరపురం, తిమ్మారావుగూడెం, కలకుర్రులో రూ.44 లక్షలు వెచ్చించి మూడు ట్యాంకులు నిర్మించారు. చాటపర్రు, కాట్లంపూడి, కోటేశ్వరదుర్గాపురంలో మరో మూడు 40 కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంకులు పూర్తి చేసారు. ఇదే క్రమంలో రూ.2.37 కోట్లతో ప్రత్తికోళ్లలంక, మాదేపల్లి, కోటేశ్వదుర్గాపురంలో సీపీడబ్ల్యూఎస్ ట్యాంకు నుంచి పైప్‌లైన్ నిర్మించారు.

ఇప్పుడు పరిస్థితి మారింది



మా పంచాయతీ శివారు గ్రామం మాధవాపురం వద్ద కొత్త ట్యాంక్ నిర్మించారు. ప్రధాన గ్రామంలో సైతం కొత్త పైప్‌లైన్ వేసారు. గతంలో తాగునీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు పరిస్థితి మారింది. పనులు అందుబాటులోకి వస్తే శివారు ప్రజలకు నీరు సరఫరా సజావుగా సాగుతుంది.

– వర్రి లక్ష్మీదుర్గ, సర్పంచ్, కోటేశ్వరదుర్గాపురం

రూ.10 కోట్లతో పనులు పూర్తి



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి వల్ల రూ.10 కోట్లతో పనులు పూర్తయ్యాయి. పెరుగుతున్న జబాభాకు అనుగుణంగా రాబోయే 20 ఏళ్ల వరకూ తాగునీటి సమస్య రాకుండా ప్రణాళిక రూపొందించి అమలు చేసారు. 15 గ్రామాల ప్రజల తాగునీటి సమస్యకు శాస్వత పరిష్కారం చూపారు.

– పెనుమత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

21న ఏలూరుకు రానున్న బీసీ రథయాత్ర


బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరాట రథయాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): బీసీల రాజ్యాధికారం కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగళరావు, రాష్ట్ర కన్వీనర్లు ఎలగల నూకాలమ్మ, వై.నాగేశ్వరరావు శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకూ చేపట్టిన బీసీ పోరాట రథయాత్ర ఈ నెల 21న ఏలూరు రానున్నట్టు బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి తెలిపారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో ఆదివారం రథయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు చేపట్టిన బీసీ పోరాట రథయాత్ర ఈ నెల 21న ఏలూరుకు చేరుకుంటుందని స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా జూట్‌మిల్లు సెంటర్‌కు చేరుకుని అక్కడ మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేస్తారన్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తారని తెలియజేసారు. ఈ రథయాత్రలో బీసీ ఉద్యోగులు, సంఘాల నాయకులు, బీసీ సోదరీ, సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు కింజంగి రాజు, తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు అబ్బిరెడ్డి రంగ ముత్యాలు, జిల్లా యువజన సంఘ నాయకులు ఎల్లపు మోజేష్, ఎచ్చర్ల ఉమామహేశ్వరరావు, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు పామర్తి యేసురాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జి మృతి ఉద్యోగ, కార్మికులకు తీరని లోటు


సాబ్జి మృత దేహానికి నివాళులర్పిస్తున్న ఐద్వా జిల్లా సభ్యులు


సాబ్జి మృత దేహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఏలూరు (టూటౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమాల నేత ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం తెలియజేసారు. ఆదివారం ఉదయం ఆయన ఎమ్మెల్సీలు కె.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావుతో కలిసి ఏలూరులో సాబ్జి మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమాలకు సాబ్జి మృతి తీరని లోటు అని అన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జి మృత దేహానికి పలువురి నివాళి

ఎమ్మెల్సీ సాబ్జి మృతదేహానికి పలువురు నాయకులు, సంఘాలు నివాళులర్పించాయి. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అన్నే బవన్ నందు ఆదివారం సంతాప సభ నిర్వహించారు. అనంతరం సాబ్జి మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు సీహెచ్ రాజ్యలక్ష్మి, జె.హారీష దుర్గ, వెంకట లక్ష్మి, కనకదుర్గ, ఉష, సైదాని లోకేశ్వరి, ఐద్వా సీనియర్ నాయకురాలు రిటైర్డ్ ఉపాధ్యాయురాలు జి.విమల తదితరులు ఉన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో సాబ్జి మృత దేహానికి సీఐటీయూ రాష్ట్ర నాయకత్వం నివాళులర్పించింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు, డీఎన్‌వీడీ ప్రసాద్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి, కార్యదర్శి కె.సుబ్బారావమ్మ, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ, కార్యదర్శి కె.ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, నాయకులు బి.సోమయ్య, కె.విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. పీడీఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్సీ విటపు బాల సుబ్రహ్మణ్యం, జనసేన ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు, రిటైర్డ్ ఉపాధ్యాయులు బీవీ రమణమూర్తి, జరజాపు రంగారావు సాబ్జి మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏలూరులో నేడు విద్యార్థుల ర్యాలీ

- వై ఏపీ నీడ్స్ జగన్‌కు సన్నద్ధం
- హాజరుకానున్న ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేద బలహీన వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పాలనతో ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి యావత్ విద్యార్థి లోకం, యువత పెద్దెత్తున మద్దతు తెలుపుతూ ఏలూరులో నేడు భారీ ర్యాలీ చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. ఏలూరు నగరంలోని జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి సోమవారం ఉదయం 10.30 గంటలకు వేలాది మంది విద్యార్థులతో ర్యాలీ ప్రారంభం అవుతుందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల దినేష్ రెడ్డి తెలిపారు. ఏలూరు నగరంలోని ఆయా విద్యాసంస్థలకు చెందిన వేలాదిమంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానితో పాటు యువతకు స్ఫూర్తినిస్తూ ప్రముఖ భారత క్రికెట్ క్రీడాకారులు అంబటి తిరుపతి రాయుడు హాజరవుతారని తెలిపారు. ఈ భారీ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పోనుగంటి చైతన్య, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ హాజరవుతారని తెలిపారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద మానవహారం, అనంతరం నగరంలో ర్యాలీ చేపడతామని తెలిపారు. ఏలూరు జిల్లాలోని వైఎస్సార్ సీపీ అభిమానులు, విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ మద్దతును తెలపాలని దినేష్ రెడ్డి కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 1998 -2003 బ్యాచ్ విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాలలో 20 ఏళ్ల అనంతరం కలుసుకుని సందడి చేశారు. స్థానిక ఒన్‌టౌన్‌లోని శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాల దీనికి వేదికైంది. 1998 – 2003 మధ్య 6 నుంచి 10వ తరగతి వరకూ చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని తాము సొంత బిడ్డలుగా భావించి విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు ప్రస్తుతం సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలవడంతో పాటు గొప్ప పౌరులుగా గుర్తింపు పొందడం తమకు అమితమైన సంతృప్తినిస్తోందన్నారు. అప్పటి విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయడంతోనే వారికి సముచిత స్థానాలు లభించాయన్నారు. ఇరవై ఏళ్లు గడిచినా తమను గుర్తుపెట్టుకుని వారి ఆనందంలో తమకూ భాగస్వామ్యం కల్పించడం ఆనందానిస్తోందని గురువులు అన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ అప్పటి తమ గురువులు నేర్పిన విద్యాబుద్ధులు తమ ఉన్నతికి ఉపయోగపడ్డాయన్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను పూర్వ విద్యార్థులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లారెన్స్, వాసుమతి, జయపాల్, సుబ్బలక్ష్మి, పూర్వ విద్యార్థులు లీలాకృష్ణ, అశోక్, సతీష్, కిరాట్, నాగలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి తమ స్నేహాలను, అనుబంధాలను గుర్తు చేసుకుని ఆనందసాగరంలో మునిగితేలారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	23

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	34820	26
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	35
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	50	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	56	బీన్సచిక్కుడు	100
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	48
బెండకాయలు	60	ములక్కాడలు	10–15
పచ్చిమిర్చి	38	కంద	56
కాకర కాయలు	60	బీట్‌రూట్	40
బీరకాయలు	50	కీర దోస	40
బీరకాయలు (పందిరి)	64	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	120
క్యారెట్	40–46	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	68	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	12
ఉల్లిపాయలు	40	తోటకూర	12
గోరుచిక్కుడు	52	గోంగూర	08
దోసకాయలు	34–46	పుదీనా	05
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	34

ఉత్సాహంగా క్రిస్మస్ సువార్త ర్యాలీ


క్రిస్మస్ సువార్త ర్యాలీలో పాల్గొన్న యువకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పట్టణంలో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు చర్చిలను ముస్తాబు చేసి విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక శాంతినగర్‌లోని మన్నా చర్చ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం భారీ క్రిస్మస్ సువార్త ర్యాలీ నిర్వహించారు. సత్రంపాడు పెట్రోల్ బంక్ వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని శాంతినగర్, గ్రేవియర్ నగర్, కట్టా సుబ్బారావు తోట, అమీనాపేట, ఫైర్ స్టేషన్ సెంటర్, పవర్‌పేట, పాత బస్టాండ్ సెంటర్, వసంతమహల్ సెంటర్, రైల్వే ఓవర్‌బ్రిడ్జ్ తదితర ప్రధాన రహదారుల గుండా తిరిగి శాంతినగర్ మన్నా చర్చ్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా క్రీస్తు జన్మకు సంబంధించిన అనేక దృశ్యాలను చిన్నారులు వేషధారణలతో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ర్యాలీలో ఏసునామ జయధ్వనులు, స్తుతి సంగీత విజయ గీతాలు ఆలపిస్తూ సాగారు. వందలాది ద్విచక్రవాహనాలపై, ఇతర వాహనాలపై యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని ఏసు ప్రభువు బోధించిన సన్మార్గ బోధనల ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని మన్నా చర్చ్ పాస్టర్ జ్యోతిరాజు పర్యవేక్షించారు.

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేయాలి

దెందులూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని యువత విజయవంతం చేయాలని శ్రీరామవరం సర్పంచ్, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం శ్రీరామవరంలో యువతకు క్రికెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కామిరెడ్డి నాని మాట్లాడుతూ గ్రామాల్లోని యువతలో ప్రతిభను వెలికితీయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రాలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని అన్నారు. యువత తమ ప్రతిభాపాటవాలను చూపాలన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి


జాతీయ పెన్షనర్స్ దినోత్సవంలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక కోటదిబ్బ సర్వీస్ రిజర్వాయర్ ఒకటి వద్ద ఏఐటీయూసీ అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, నాయకులు బి.నారాయణరావు, పీవీ రమణ, డి.వెంకటేశ్వరరావు, పెద్దిరాజు,కెలోమీ, సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ మాదేపల్లి శివారు గురకలపేట ప్రాంతంలో కోడిపందేలపై ఏలూరు రూరల్ పోలీసులు దాడి చేశారు. ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి తమ సిబ్బందితో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై ఆదివారం దాడి చేశారు. కోడిపందేలు నిర్వహిస్తోన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కోడిపుంజు, రూ.1,400 నగదు, 270 కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్ కాలనీకి చెందిన కోడి కత్తులు సరఫరా చేస్తున్న పాలెపు వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

జట్టు ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ఏలూరు (టూటౌన్): అసంఘటిత రంగంలో పనిచేస్తున్న జట్ల ముఠా కార్మికులకు, హమాలీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కోరారు. స్థానిక మెయిన్ బజార్లో జలవాణి సెంటర్లో ఏఐటీయూసీ అనుబంధ జట్లు లాగుడు బండ్ల కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం పుప్పాల కన్నబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఏఐటీయూసీ పతాకాన్ని యూనియన్ గౌరవ అధ్యక్షుడు మారిన వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కృష్ణ చైతన్య హాజరయ్యారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, సంఘం కోశాధికారి పెచ్చెట్టి శ్రీనివాస్, నాయకులు ఏ.అప్పలరాజు, భజంత్రీ శ్రీనివాసరావు, కడుపు కన్నయ్య, వంగలపూడి గంగరాజు పాల్గొన్నారు.

చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి


విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి

ఏలూరు (టూటౌన్): చట్ట సభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి అన్నారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళలు-మహిళా కార్మికుల చట్టాలు అంశంపై ఆదివారం సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అడబాల లక్ష్మి మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం అని రాజ్యాంగంలో మహిళలకు సంబంధించిన హక్కులు, భద్రత, సమానత్వం, సాధన కోసం మహిళలు పోరాటాలు చేయాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్ట సభల ద్వారానే చట్టాలు రూపొందుతాయన్నారు. చట్టాల అమలు బాధ్యత కార్య నిర్వాహక వ్యవస్థదే అన్నారు. చట్టాల అమలు సక్రమంగా జరగనప్పుడు కోర్టు ద్వారా పరిష్కరించుకునే విధంగా మహిళలు పోరాడాలన్నారు. మహిళలకు గౌరవ ప్రదమైన జీవితం ప్రాథమిక హక్కు అన్నారు. ఈ అవగాహన సదస్సులో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల, కార్యదర్శి మన్నవ యామిని, సహాయ కార్యదర్శి గొర్లి స్వాతి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు కొండేటి బేబి, కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర పాల్గొన్నారు.